

# అమెరి "కలగూరగంప" కామెడి

## వంగూరి చిట్టెన్‌రాజు



### ఆర్.యస్.వి.పీ కథ

20

**నా చిన్నప్పుడు ఎప్పుడైనా నేను క్రికెట్‌లో డక్ ఔట్** అయినప్పుడు...అంటే...చాలా సార్లే-- 'నువ్వు ఉట్టి వీపీ గాడివిరా, వాడు వేసిన వెధవ బంతికి అలాగా ఆడడం?' అనే వాడు చంటి గాడు. నేను వేసిన ఆఫ్ స్పిన్నర్‌ని అవతలి టీం వాడు సునాయాసంగా సిక్సర్ కొట్టేస్తే 'నువ్వు ఉట్టి యస్పీపీవి రా, ఆఫ్ స్పిన్నర్ అంత వెధవలాగ వేస్తావా? ' అని తిట్టేవాడు. వీపీ అంటే అంటే వెర్రి పప్పు, వెర్రి పీనుగ లాంటి శుద్ధ తెలుగు అర్థాలు ఉన్నాయి. అన్నింటి తాత్పర్యమూ ఒకటే...నన్ను బోల్తా కొట్టించడం చాలా తేలిక అని వాటి అర్థం. నువ్వు ఇలాటివాడివి అని ముందే తెలిస్తే ఆ సుబ్బారావునే చేసుకుందును అని మా క్వీన్ విక్టోరియా వారానికోసారి ఉసూరుమంటూనే ఉంటుంది. అయినా ఇంకా నాతోనే ఉంటోంది ముప్ఫై ఏళ్ళపైగా. కానీ ఈ వారం మటుకు ఆ స్వరం స్థాయి పెరిగింది. సుబ్బారావు ఎక్కడున్నాడో తెలిస్తే బావుండును అని ఒకటికి రెండు సార్లు నాకు వినపడేలా అనేసింది కూడానూ. నువ్వు మామూలు వీపీవి కాదు, యస్పీపీవి కాదు. ఆరెస్వీపీవి...నో డౌట్ అంది తనకున్న ధాటీ అంతా ఉపయోగించి.

ఇంతకీ ఏం జరిగిందంటే మొన్ననే మా అమ్మాయి పెళ్ళయింది. సాధారణంగా అమెరికాలో అమ్మాయి కానీ అబ్బాయి కానీ పెళ్ళి అయిపోయాకే తల్లిదండ్రులకి తెలుస్తుందని ఇండియాలో అంతా అనుకుంటారు. అప్పుడప్పుడు..... 'డాడీ ...మీట్ యువర్ మనవడు....అని పెళ్ళయిన ఏడాదికి కానీ తల్లిదండ్రులకి భర్తని కూడా పరిచయం చెయ్యరట కదా అమెరికాలో!? ' అనుకుంటూ...మన కర్మ భూమి మరియు ఆధ్యాత్మకత మీద ఉపన్యాసాలు ఇచ్చే ప్రబుద్ధులు కూడా నేను ఎప్పుడైనా పవిత్ర భారతదేశం వెళ్ళినప్పుడు కనపడుతూ ఉంటారు. అటువంటి వారిని నిరాశ పరుస్తూ, మా అమ్మాయి పెళ్ళి అంతా మా ఇష్టప్రకారమే జరిగింది. పాపం, మా అల్లుడు కూడా అమాయకుడేనేమో తెలియదు కానీ ఆర్నెల్ల క్రితం మా ఇంటికి వచ్చి, "మీరు పెర్మిషన్ ఇస్తే నేను మీ అమ్మాయిని పెళ్ళిచేసుకోవాలని అనుకుంటున్నాను" అన్నాడు. ఆ అబ్బాయి మాకు చాలా కాలంగా తెలిసిన వాడే బాగా చదువుకున్నవాడు. పైగా నా కంటే బాగా పొడుగ్గా, అందంగా ఉంటాడు. అలాంటి వాడితో మనకెందుకూ? పైగా నాకూ, క్వీన్ విక్టోరియాకి ఇలాంటి విషయాల్లో అనుభవం లేక కాస్సేపు ఆశ్చర్యపోయి, తేరుకుని "ముందు మా అమ్మాయిని అడుగు. ఆ అమ్మడు ఒప్పుకుంటే అప్పుడు చూద్దాం" అని బ్రిలియంట్‌గా చెప్పేసి పక్క గదిలోకి వెళ్ళిపోయాను ఎందుకైనా మంచిదని. మొత్తానికి అన్నీ కుదిరి, ఆరు నెలలగా చాలా మంది సహాయంతో పెళ్ళి పనులు పూర్తి చేసి లక్షణంగా పెళ్ళి జరిపించాం..ఒక్క "répondez s'il vous plaît" విషయంలో తప్ప.

ఈ "répondez s'il vous plaît" అంటే నాకు ఎప్పటినుంచో భలే చిరాకు. ఎవరైనా నన్ను "బంధుమిత్ర సమేతంగా వచ్చి మదర్పిత చందన తాంబూలాదులు స్వీకరించి" అంటూ శుభలేఖ పంపించారు అనుకోండి. వెంఠనే ఇదివరలో "హాస్య బ్రహ్మ" భమిడిపాటి వారు అనుమాన పడ్డట్టు "సమేతంగా" అంటే మన మేత మనమే తెచ్చుకోవాలా లేక పెళ్ళి వారు భోజనాలు పెడతారా, పెట్టరా అని ఆ శుభలేఖలో అన్ని పేజీలూ తీవ్రంగా గాలిస్తాను. పూర్వం రోజుల్లో పెళ్ళి భోజనానికే పిలిచే వారు కానీ, ఈ రోజుల్లో అసలు పెళ్ళీ, పెళ్ళి భోజనాల కంటే ఈ రిసెప్షన్ అనే తతంగానికే ఎక్కువ ప్రాధాన్యత వచ్చింది...ముఖ్యంగా అమెరికాలో. పెళ్ళికి రాకపోయినా పరవాలేదు. రిసెప్షన్‌కి తప్పకుండా రండి అని పిలిచిన వాళ్ళూ కూడా నాకు తెలుసు. ఎందుకంటే ఈ రిసెప్షన్‌లో తమ స్టేటస్ చూపించుకోడానికి అవకాశం ఉంటుంది. పెళ్ళి మండపానికీ, తంతులకీ, బట్టలకీ పాతిక వేలలో అవగొట్టేసి, పురోహితుడిగారికి కేవలం నూట పదహారు డాలర్లు ఇవ్వడానికి బేరమాడేసి, రిసెప్షన్‌కి మటుకు హిల్టన్ హొటెల్ వారికో, మారియాట్ హొటెల్ వారికో బేంక్వెట్ హాలులో కేవలం అడుగుపెట్టడానికి యాభై వేలూ, అచ్చంగా చచ్చు పాటలు వేస్తూ అందరినీ డేన్స్ చెయ్యమని రెచ్చగొట్టే డిస్కొజాకీ గాడికి పాతిక వేలూ, మనిషికి ఒక చెంచాడు వచ్చే వెడ్డింగ్ కేక్‌కి ఐదువేలూ..ఇలా రిసెప్షన్ తతంగాలకి లక్ష డాలర్లు ఖర్చు పెట్టేసి, ఆ తరువాత భోరుమనడం అమెరికాలో ఎప్పుడూ జరిగే తతంగమే.

ఇక శుభలేఖలు సరే, కనీసం ఒక దస్తాడు కాగితాలూ, వీశ బరువూ ఉంటాయి. ఇందులో నాకు చికాకు కలిగించే అంశం ఏమిటంటే.... ఆ శుభలేఖల్లో ఆఖర్న ఉండే చిన్న కార్డు. అదే "répondez s'il vous plaît" అంటే "నువ్వు పెళ్ళికి వస్తావా? చస్తావా? రిసెప్షన్‌కి కూడా వచ్చి చస్తావా? వస్తే, గిస్తే ఎంత మంది తగలడతారూ? వాళ్ళ పేర్లు, వయస్సు, ప్రవరా ఏమిటి? ఏ విషయమూ ఫలానా తారీకు, సాయంత్రం నాలుగున్నర కల్లా "répondez s'il vous plaît" పంపించకపోతే, అంతే సంగతులు, " పైగా ఆ కార్డుని ఒక చిన్న కవరులో పెట్టి, దానికి స్టాంప్ అంటించి, అడ్రసు కాగితం కూడా అంటించేసి మనల్ని మొహమాట పెట్టేస్తారు. మొదట్లో నేను ఈ కార్డు వెనక్కి పంపించక పోతే ఆ రోజున పెళ్ళికీ, రిసెప్షన్‌కీ లోపలకి రాకుండా గూర్ఖా వాడు అడ్డుకుంటాడేమో అనుకునే వాడిని. ఆ తరువాత, ఆ కార్డుకి అంటించిన స్టాంప్ చింపేసుకుని, దాచేసుకుని, చెప్పకుండా వెళ్ళి పోయినా నాకు ఎప్పుడూ ఇబ్బంది రాలేదు. మహా అయితే నా పేరున కుర్చీ కేటాయించరు అంతే. బైటకి మటుకు గెంటెయ్యరు. ఈ కార్డు ముక్క తతంగాన్ని ఆర్ యస్ వీ పీ అంటారు ఇంగ్లీషులో. ఇన్నాళ్ళూ ఈ ఆర్ యస్ వీపీ అంటే నాకు అఖండమైన అగౌరవం, చికాకూ ఉండేవి.

కానీ ఇప్పుడు మా అమ్మాయి పెళ్ళి టైములో మారియాట్ హొటెల్లో రిసెప్షన్ చేద్దామనుకున్నప్పుడు ఇది బ్రహ్మాస్త్రం లాంటిదని తెలిసి వచ్చింది. ఈ ఆర్ యస్ వీ పీ లేనిదే, వచ్చే వాళ్ళ పేర్లు చెప్పనిదే, ఖచ్చితంగా ఎన్ని చిన్నా, పెద్దా శాల్తీలు వస్తారో తెలియనిదే మారియాట్ వారు ఒప్పుకోరు. నేనైతే అందరినీ రమ్మని పిలిచాం కదా....కాబట్టి అందరూ వస్తారనీ, రావాలనీ నా కోరిక. అందుకే మొత్తం పిలిచిన వారి సంఖ్య చెప్పగానే, మా క్వీన్ విక్టోరియాతో సహా అందరి గుండెలూ గుభేల్ మన్నాయి. "అయ్య బాబోయ్. అంత మందే, అంత డబ్బే" అని బావురుమంది మా క్వీన్ విక్టోరియా. రిసెప్షన్ ఖర్చు అంతా మనదే కాదుగా అని సద్ది చెప్పబోయాను. ఈ లోపుగా మా మారియాట్ వారు పెద్ద బాంబు వేశారు. మీరు రిజర్వ్ చేసుకున్న హాలులో కొంత భాగం మాకు చెప్పకుండా ఎవరో పాకిస్తాన్ వాళ్ళకి అదే రోజున, అదే సమయానికి అద్దెకిచ్చేశారు. ఇవతల నేను విజ్రుంభించేసి ఊళ్ళో నాకు తెలిసిన వారందరిలో చాలా మందిని విందుకి పిలిచేశాను. కానీ అంత మంది ఆ బేంక్వెట్ హాలులో పట్టరు కావున,, కిం కర్తవ్యం మూఢం? బల్లలు..అంటే డైనింగ్ అక్కర లేదు కానీ కనీసం వంద కుర్చీలు వెయ్యండీ, అసలు నేల మీదే కూచుని భోజనం చెయ్యడం మా పవిత్ర హిందూ సాంప్రదాయం అంటే సదరు మారియాట్ వారు "మా బిల్డింగ్ ఫైర్ కోడ్ అందుకు చస్తే ఒప్పుకోదు" అని భగ్గుమన్నారు. అదే ఇండియాలో అయితే ఫైరూ లేదు, కోడూ లేదు, గాడిద గుడ్డూ లేదు. అవసరమైతే గోడ పగలగొట్టి పక్కింటి వాడి స్థలాన్ని కబ్జా చేసేసి రిసెప్షన్ జరిపించెయ్యవచ్చును కదా అని అమెరికా వచ్చినందుకు మరోకసారి చాలా విచారించాను.

మరొక పొరపాటు ఏమిటంటే అందరినీ బంధు మిత్ర సపరివారంగా ఆహ్వానించడం. ఆ అదును చూసుకుని ఒకాయన "మీరిచ్చే విందుకి ఎనమండుగురం వస్తున్నాం. మీకు ఇబ్బంది లేదు కదా!" అని ఆఖరి క్షణంలో ఆర్ యస్ వీ పీ పంపించాడు. మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టు నేను కుయ్యో మొర్రో అనుకుని "మీ ఇంట్లో ఉండేది నువ్వూ, మీ ఆవిడే కదా! నాకు తెలియకుండా ఇంత మంది పిల్లల్ని ఎప్పుడు కన్నారూ? అని అడిగాను. "మేం పిల్లల్ని కనడం నీకెందుకు తెలియాలోయ్ వెర్రి నాయనా, అది మా ఇష్టం. ఆ మిగిలిన ఆరుగురూ మా మేనత్త మూడో కూతురి నాలుగో స్నేహితురాలూ, ఆవిడ తల్లిదండ్రులూ , పిల్లలూనూ. మొన్ననే ఇండియా నుంచి వచ్చారు. అమెరికాలో మన వాళ్ళ పెళ్ళీ, పెటాకులూ..అంటే రిసెప్షనూ ఎలా ఉంటాయో అని వాళ్ళు ముచ్చట పడ్డారు. అందుకూ" అన్నాడు ఆ పెద్ద మనిషి. "ఉద్ధరించారు" అని ఫోన్ పెట్టేశాను.

ఇక మారియాట్ వారి నిబంధనలు పాటించక తప్పలేదు. అటు మనకి ఎగస్పార్టీ అయిన పాకిస్తానీ పార్టీ వాళ్ళు పవిత్ర భారతీయులని ఓడించడానికి ఇదే మంచి అవకాశం అనుకుని మాకు బేంక్వెట్ హాలులో మాకు మరికొంత ఇవ్వడానికి ఏ మాత్రం ఒప్పుకోలేదు. ఏమీ గత్యంతరం లేక, బుద్ధిగా, ఆప్యాయంగా ఆర్ యస్ వీ పీ పంపించిన వాళ్ళలో చాలా మందికి ...సదరు ఎనిమిది మంది తాలూకు పెద్ద మనిషితో సహా...క్షమాపణలు కోరుకుంటూ రిసెప్షన్‌లో "మదర్పిత స్నాక్, బీరు వైనులను" ఆస్వాదించడానికి రావద్దనియూ, కావాలంటే మీ ఇంటికే ఆ ద్రవ్యాలు సరఫరా చేస్తాననియూ, ఒక వేళ పొరపాటున వచ్చినా మీకు కుర్చీ కేటాయించలేం కావున గోడ కుర్చీ వెయ్యవలయుననూ అనియూ అందరికీ నా రిసెప్షన్ ఆహ్వానాన్ని ఉపసంహరించుకున్నాను.

నా అవస్థ చూడ లేక, చూసీ చూడనట్టు నటిస్తూ మా క్వీన్ విక్టోరియా నువ్వు మామూలు వీపీవీ కాదు, యస్వీపీవీ కాదు. ఆరెస్వీపీవి...నో డౌట్ అంది తనకున్న ధాటీ అంతా ఉపయోగించి.

"నేనా? ఆర్ యస్ వీ పీ నా? అదేమిటీ, నీ తలకాయ" అన్నాను, ఇక్కడ "నీ తలకాయ" అనే మాట అశ్వత్థామ, కుంజర; టైపులో అన్నాను భర్తగా నా జాగ్రత్తలో నేను ఉండాలి కాబట్టి.

"అదేనోయ్, వీ పీ అంటే వెర్రి పప్పు, దానికి యస్ చేరిస్తే శుద్ధ వెర్రి పప్పు...తెలుసుగా"

"మరి దానికి ఆర్ చేరిస్తే"...అది ఏమిటై ఉంటుందా అన్నాను ఆలోచిస్తూ..

"ఆర్ అంటే ఇంకేమిటీ..నువ్వే....నీ పేరే...అనగా ఆర్ గారు శుద్ధ వీ పీ " అని లోకులు చెప్పుకుంటారులే...ఆ మారియాట్ హొటెల్ వాడు వేసిన బంతికి డక్ ఔట్ అయ్యావుగా! నీ సంగతి తెలుసు కాబట్టి ఎవరూ కోప్పడరులే" అని సుతారంగా టెంకి జెల్ల తగిలించేసి ఉద్యోగానికి వెళ్ళిపోయింది మా క్వీన్ విక్టోరియా.

Post your comments